వైభవంగా దత్తాత్రేయ జయంతి



పూజల్లో ఠాకూర్ గోపాల్ సింగ్, రాకేష్ జైస్వాల్, ముఖేష్ సింగ్



భక్తులతో కిక్కిరిసిన సీతారాంబాగ్ దత్తాత్రేయ ఆలయం

జియాగూడ: సీతారాంబాగ్ పహాడ్‌పై దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్రీనాథ్ సింగ్, కోశాధికారి ఠాకూర్ గోపాల్ సింగ్, కార్యదర్శి కృష్ణంరాజ్, ఉపాధ్యక్షులు వీరేందర్ సింగ్, సందీప్ సింగ్ ముందుగా ఆలయంలో పూజలు చేసి దత్తాత్రేయ జయంతి వేడుకలు ప్రారంభించారు. సీతారాంబాగ్ పరిసర ప్రాంతాల ప్రజలే కాక నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

పలువురు ప్రముఖుల పూజలు..

దత్తాత్రేయ పహాడ్‌పై ఉన్న దత్తాత్రేయాలయంలో పలువురు ప్రముఖులు ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్లు శశికళ కృష్ణ, రాకేష్ జైస్వాల్, గోషామహల్ బీజేపీ నాయకులు సోమరాజ్ సింగ్, ఎం.కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్, జి.శ్రీనివాస్ యాదవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం: ఠాకూర్ గోపాల్ సింగ్, బద్రినాథ్ సింగ్

దత్తాత్రేయ జయంతి సందర్భంగా దత్తాత్రేయ పహాడ్‌పై భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు ఠాకూర్ గోపాల్ సింగ్, బద్రినాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇటీవలే తమ కొత్త కమిటీ ఏర్పడిందని రానున్న రోజుల్లో ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

ఆకట్టుకున్న గొల్ల కలాపం



ప్రదర్శనలోని ఓ సన్నివేశం

నాంపల్లి: భాగవతుల రామయ్య రచించిన ఆత్మ యజ్ఞం అనే గొల్ల కలాపాన్ని నృత్యకారులు డాక్టర్ పి.రమాదేవి, ఎన్ఆర్ఐ మనస్విని అవ్వారికి అద్భుతంగా నర్తించి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో గొల్ల కలాపం నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. 18వ శతాబ్దంలో భాగవతుల రామయ్య ఆత్మ యజ్ఞం అనే గొల్ల కలాపాన్ని రచించారు. కాలక్రమేణ ఈ ప్రదర్శనను వెంపటి వెంకట నారాయణ, భాగవతుల విస్సయ్య, వేదాంతం పార్వతీశం వంటి వారెందరో భాగవతుల గొల్ల కలాపం వేషాన్ని చిత్రీకరించినా పూర్తి స్థాయిలో ప్రదర్శించబడలేదు. కానీ ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్ 2004లో భాగవతుల రామయ్య రచించిన ఆత్మయజ్ఞం ఆధారంగా పూర్తి నిడివి కలిగిన గొల్ల కలాపాన్ని శిష్యులైన డాక్టర్ రమాదేవి, మనస్విని అవ్వారికి నేర్పించారు. వీరు 2012లో రవీంద్ర భారతి వేదికపై గొల్ల కలాపాన్ని ప్రదర్శించి రికార్డు సాధించారు. 12 ఏళ్ల తర్వాత వీరిద్దరూ మళ్లీ తెలుగు వర్సిటీలో నర్తించారు. ప్రవాస భారతీయురాలైన మనస్విని అవ్వారికి గ్రాండ్ ఫాదర్, గ్రాండ్ మదర్ తంగిరాల రాజ్యలక్ష్మి, తంగిరాల కోటేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి గొల్ల కలాపం ప్రదర్శనను ప్రారంభించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ పద్మజారెడ్డి, తెలుగు వర్సిటీ విశ్రాంత నృత్య గురువు డాక్టర్ భాగవతుల సేతూరామ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభా రాజు, తెలుగు వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్యాన్స్ హెడ్ డాక్టర్ వనజా ఉదయ్ అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



పూజలు చేస్తున్న స్వామి డీజే గోపాల్ తదితరులు

జియాగూడ: దుర్గానగర్‌లో అయ్యప్ప పడి పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం డీజే గోపాల్‌స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటైన అయ్యప్ప పడి పూజలో ముందుగా గణపతి, కుమారస్వామి, అయ్యప్పల పంచామృతాభిషేకం, అలంకరణ, గణపతి హోమం, సత్యనారాయణ వ్రతం, అఖండ హారతి, స్వాములకు బిక్ష, అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, జియాగూడ ప్రధాన కార్యదర్శి సి.బాబు, శైలేందర్ సింగ్, మహేశ్చారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 30 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి



కేలండర్ ఆవిష్కరణలో షియా ముస్లిం మత పెద్దలు

చార్మినార్: రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని షియా అన్నా అషారి వక్ఫ్ ప్రొటెక్షన్ ఫ్రంట్ అధ్యక్షుడు మీర్ హైదర్ అలీ జాఫ్రీ అన్నారు. ఆదివారం సాయంత్రం దారుషిఫాలో రెహనుమా ఇ అవాం అనే కేలండర్ ప్రారంభోత్సవం జరిగింది. అంజుమన్ అలావి అక్బరీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ ఖిబ్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీర్ హైదర్ అలీ జాఫ్రీ పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో తగిన ప్రణాళిక రూపొందించి కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు షియా ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల విద్యార్థులకు పౌష్టికాహారం



షేక్‌పేట్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులతో సత్యనారాయణ తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలోని గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కామన్ డైట్ మెనూను అమలులోకి తెచ్చిందని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.బాలస్వామితో కలిసి హాస్టల్ కిచెన్‌ను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూలో ఉన్న వంటకాలను విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలని ఆయన ప్రిన్సిపాల్‌ను కోరారు. గురుకులాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం సత్తాచాటేందుకు కొత్త మెనూను అమలులోకి తేవడం జరిగిందన్నారు. అనంతరం ఆయన ప్రిన్సిపాల్, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అన్ని ప్రాంతాల్లో అత్యాధునిక లైట్స్ ఏర్పాటు చేస్తాం



హెరిటేజ్ డెకరేటివ్ పోల్ లైట్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని కూడళ్ల వద్ద అత్యాధునిక హెరిటేజ్ డెకరేటివ్ పోల్ లైట్స్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన హకీంపేట్ సాలార్ బ్రిడ్జి వద్ద అత్యాధునిక హెరిటేజ్ డెకరేటివ్ పోల్ లైట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.27 లక్షలతో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లను సైతం అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయన్నారు. టోలిచౌకీ చౌరస్తాలో లేబర్ అడ్డా ఉందని దానికి అనుగుణంగానే ఎంతో నూతన విధానంతో ఫ్లై ఓవర్ పిల్లర్లకు బొమ్మలు వేస్తున్నామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కార్వాన్‌కు నిధులు కేటాయించేలా చూడాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, అంతే కాకుండా వివిధ శాఖల అధికారులను కూడా కలిసి అభివృద్ధికి చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.



గుల్జార్‌హౌజ్-చార్మినార్ రోడ్డులో ట్రాఫిక్ జాం

చార్మినార్‌లో కాలిబాట కనుమరుగు

- చార్మినార్ చుట్టూ చిరువ్యాపారాలే..
- తప్పని ట్రాఫిక్ తిప్పలు
- వరుస సెలవులతో కిటకిటలాడిన చార్మినార్ పరిసరాలు

చార్మినార్: వరుసగా రెండు రోజులు సెలవులు కావడంతో పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ సందడిగా కనిపించాయి. మక్కా మసీదు, చార్మినార్, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్ తదితర పర్యాటక ప్రాంతాల్లో సాధారణ రోజుల కన్నా.. ఆదివారం సందర్శకుల సందడి ఎక్కువైంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు ట్రాఫిక్ జాం తిప్పలు తప్ప లేదు. చార్మినార్ వద్ద కనీసం సెల్ఫీలు దిగడం కోసం కొద్దిపాటి ఖాళీ స్థలం కనిపించ లేదు.

అన్నీ నడిరోడ్డు పైనే..

పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి.. ఒక్కటేమిటి పాతబస్తీలో అన్నీ రోడ్ల పైనే దర్శనం ఇస్తాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!.. పర్యాటకపరంగా, వ్యాపార పరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక శని, ఆదివారాల్లో చార్మినార్ వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. మదీనా-చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాతులే కాదు..రోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఒక ప్లేస్‌ను కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.



చార్మినార్‌లో సందర్శకుల సందడి

పాదచారుల జోన్ ఏదీ..?

కాలిబాట పథకంలో భాగంగా చార్మినార్ కట్టడం నలువైపులా పాదచారుల జోన్ ఏర్పాటు చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి చార్మినార్ కట్టడం వైపు వెళ్లే నాలుగు కూడళ్ల రోడ్లలో వాహనాల రాకపోకలను నివారించి ప్రత్యేకంగా గ్రానైట్ రోడ్డు నిర్మించారు. ఈ గ్రానైట్ రోడ్డులో కేవలం కాలినడకకు మాత్రమే వినియోగించే విధంగా గతంలో తగిన ఏర్పాట్లు చేశారు. ప్రపంచ పర్యాటక ప్రాంతాలైన చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, లాడ్‌బజార్ తదితర పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వచ్చే పర్యాటకులు కేవలం కాలినడకన వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. మొదట్లో పాదచారుల జోన్ చక్కగానే అమలు జరిగినా..ఏళ్లు గడిచే కొద్ది చిరువ్యాపారుల సంఖ్య పెరగడంతో కాలిబాట కనుమరుగైంది.

కాలిబాట కోసం బారికేడ్లు ఏర్పాటు చేయాలి: సందర్శకులు

సందర్శకులు నడిచి వెళ్లేంత స్థలం కూడా వదలకుండా టేలా బండ్ల చిరువ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రపంచ పర్యాటకులు పడరాని పాట్లు పడుతున్నారు. వీరందరిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. చిరువ్యాపారులను దృష్టిలో ఉంచుకుని వారి వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు మధ్యలో వైట్ మార్కింగ్ వేసి కాలిబాటను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అవసరమైతే అక్కడక్కడ తాత్కాలిక బారికేడ్లను ఏర్పాటు చేసి పర్యాటకులకు కలుగుతున్న అసౌకర్యాలను దూరం చేయాలని కోరుతున్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్ రవీందర్ నాయక్‌నగర్‌లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. 225, 228, 229 బూత్ కమిటీలకు ఎస్.రమేష్ నాయక్, ఆర్.రాకేష్ నాయక్, ఎస్. పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. పార్టీ ఎస్టీ సెల్ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కామాటి మహేష్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కౌడీ మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, సీనియర్ నాయకులు చిరంజీవి, ప్రవీణ్ రాథోడ్, రఘు నాయక్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గోల్కొండ: ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను చేకూర్చుతాయని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాధర్ భట్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్‌లో శ్రీ మత్ భగవత్ గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో 501 సభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గీతా ప్రచార సమితి షేక్‌పేట్ అధ్యక్షుడు ఎస్.లింగం నటేశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. షేక్‌పేట్ గుట్ట పోచమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గీతా ప్రచార సమితి అధ్యక్షుడు లింగం నటేశ్వర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



యాకుత్‌పురా: రోడ్డు విస్తరణ, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని రెయిన్‌బజార్ డివిజన్ మదీనానగర్‌లో రూ.18 లక్షలతో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతలమయంగా మారిన రోడ్లను తొలగించి నూతన రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, ఏరియా కమిటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గోల్కొండ: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ నామమాత్రం ఫీజులు తీసుకుంటున్నామని నానల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ మర్డా అన్నారు. ఆదివారం వందేపురుషోత్తం సత్‌సంగ్ విహార్‌లో ప్రీమియర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మూడు దశాబ్దాలకు పైగా ప్రీమియర్ ఆసుపత్రి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తు ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ఈ శిబిరం మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, అమీన్ పర్యవేక్షణలో జరిగింది. దాదాపు 200 మందికి ఉచిత వైద్య సేవలు నిర్వహించి సరైన సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఎక్సైజ్ శాఖ మంత్రిగా జూపల్లిని తొలగించాలి



మాట్లాడుతున్న విక్రమ్ గౌడ్

గన్‌ఫౌండ్రీ: కల్లుగీత వృత్తిపై జులుం ప్రదర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావును ఎక్సైజ్ శాఖ నుంచి తప్పించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా కొంత కాలంగా కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు, నార్కోటిక్, పోలీస్ అధికారులు అక్రమంగా దాడులు చేస్తున్నారని మంత్రి ఆదేశాలతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడ్లకు 25 శాతం వైన్స్, బార్‌లలో అవకాశాలు కల్పిస్తామని హామీని ఇచ్చారని, కానీ నేడు కల్లు గీత కార్మికులను అణచివేసే ధోరణిని అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ఎక్సైజ్ శాఖ మంత్రిని తొలగించాలని ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగ శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి ఇంద్రం రజక, గూడూరు భాస్కర్, కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

గన్‌ఫౌండ్రీ: భారత మాజీ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏఐసీసీ ఓబీసీ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, ఇతర కాంగ్రెస్ నాయకులు ఇఫ్తెకార్, రమణారెడ్డి, శ్యామ్‌రావ్, రణధీర్ సింగ్, మల్లేష్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..నిజాంలను కూకటి వేళ్లతో అంతమొందించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.

యాకుత్‌పురా: సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వల్లభాయ్ పటేల్ న్యాయవాదిగా, హోంమంత్రిగా దేశ సమైక్యత అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.



నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు



పటేల్‌కు నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా



నివాళులర్పిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి

21న నెల్లుట్ల రమాదేవి పుస్తకాల ఆవిష్కరణ సభ

నాంపల్లి: తెలంగాణ రచయితల సంఘం వరంగల్, జంటనగరాల శాఖల సంయుక్త నిర్వహణలో డిసెంబరు 21న శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నెల్లుట్ల రమాదేవి రచించిన 'అశ్రువర్షం' కవితా సంపుటి, 'రామాయణం-1' కాలమ్ పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుందని నిర్వాహకురాలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరై అశ్రువర్షం పుస్తకాన్ని, విశిష్ట అతిథిగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరై రామాయణం-1 పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అలాగే డాక్టర్ కొండపల్లి నిహారిణి సంపాదకత్వంలోని మయూఖ అంతర్జాల పత్రిక జరిపిన 45 మంది సాహితీవేత్తల ఇంటర్వ్యూల సంకలనం 'మయూఖ ముఖాముఖి' పుస్తకాన్ని తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆవిష్కరిస్తారు. డాక్టర్ అమృతలత, కందుకూరి శ్రీరాములు విమల కొల్లాపురం, వేణు నక్షత్రం ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల ప్రగతి



సంబరాలు చేస్తున్న మెట్టు సాయికుమార్ తదితరులు

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల ప్రజల ప్రగతి, అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పార్టీ ప్రగతి పథంలో కొనసాగుతుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు పదవీబాధ్యతలు తీసుకొని వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ అందించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీల్లో యువత పాత్ర కీలకం



నగర అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌తో ఇమ్రాన్ అలీఖాన్

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీల్లో యువత పాత్ర కీలకమని నగర అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకుడు, గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుడు ఇమ్రాన్ అలీఖాన్ ఆదివారం ఆయనను కలిశారు. తన నాయకత్వంలో గోల్కొండ, లంగర్‌హౌస్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని యువకులు పీస్ అండ్ మైత్రి కమిటీలో చేరాలనుకుంటున్నారని ఇమ్రాన్ అలీఖాన్ ఆయనకు తెలిపారు. యువకులు స్వచ్ఛందంగా పీస్ అండ్ మైత్రి కమిటీల్లో సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమని అదనపు కమిషనర్ అన్నారు.

రేపు రవీంద్ర భారతిలో పెన్షనర్స్ డే

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న రవీంద్ర భారతిలో పెన్షనర్స్ డేను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కె.కొమురెల్లి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండారాం, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీష్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి పునాదులు



టీపీసీసీ అధ్యక్షుడితో కురాకుల కృష్ణ

గోల్కొండ: కార్యకర్తలు పార్టీకి పునాదులాంటి వారని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆదివారం ఆయనను కలిశారు. గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ పదవి పార్టీ సీనియర్ కార్యకర్త అయిన తనకే ఇవ్వాలని ఈ సందర్భంగా కురాకుల కృష్ణ టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. నగర ఇన్‌చార్జి మంత్రితో పాటు ఇతర నాయకులను సంప్రదించి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విషయంపై తగిన నిర్ణయం తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు అన్నారు.

కప్ గెలుచుకున్న ఆషాన్ సీసీ జట్టు



ట్రోఫీని అందజేస్తున్న ఆలె జితేంద్ర

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ (మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్)లో ఆదివారం నిర్వహించిన దుర్గా సింగ్ ఠాకూర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఆషాన్ సీసీ జట్టు గెలుచుకుంది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఫైనల్‌లో ఆషాన్ సీసీ జట్టు, రాజీవ్ గాంధీ సీసీ జట్లు పోటీపడగా ఆషాన్ సీసీ జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర ఆషాన్ సీసీ జట్టుకు క్రికెట్ టోర్నమెంట్ కప్‌తో పాటు రూ.8,888 క్యాష్ ప్రైజ్, మెడల్స్‌ను అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన రాజీవ్‌గాంధీ సీసీ జట్టుకు రూ.4,444 క్యాష్ ప్రైజ్, ట్రోఫీ, మెడల్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు గోకుల్, కె.అజయ్, శ్రీకాంత్ స్వామి, కపిల్ కుపిందర్, బీజేపీ నాయకులు జమాల్‌పూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.